కాటా కనికట్టు!

కిలోకి 150 నుంచి 250 గ్రాముల వరకు మోసం

- తూనికలో మాయాజాలం
- లబోదిబోమంటున్న వినియోగదారులు
- ఎలక్ట్రానిక్ కాటాల్లో స్విచ్‌ల ఏర్పాటు
- తనిఖీలు చేస్తున్నా మారని తీరు



చేపలు తూస్తున్న దృశ్యం

గోపాలపట్నం: వినియోగదారుల్లో అవగాహన లేమిని ఆసరగా చేసుకుని వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాల్లో సైతం మాయాజాలం చేస్తున్నారు. కిలోకి 150 గ్రాముల నుంచి 250 గ్రాముల వరకూ నొక్కేస్తున్నారు. వినియోగదారుల నుంచి మాత్రం కిలోకి డబ్బు గుంజుతున్నారు. గోపాలపట్నం బంక్ సమీపంలోని చేపల బజారులో కొందరు వ్యాపారుల చేతి వాటంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

తనిఖీలు చేస్తున్నా..

ఇక్కడి బజారులో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి కాటాలను సీజ్ చేస్తున్నా వ్యాపారుల తీరు మారడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. రెండు నెలల కిందట తూనికలు కొలతల అధికారులు తనిఖీలు చేసి సుమారు 25 కాటాలను సీజ్ చేశారు. అధికారులు బజారు నుంచి బయటకు వెళ్లిన వెంటనే దాచి ఉంచిన పాత కాటాలను తీసి ఇదే మాదిరిగా వ్యాపారాలు కానిచ్చేశారు. అదే పంథాలో వ్యాపారం చేసి వినియోగదారులకు టోపీ పెడుతున్నారు.

కాటాలకు ప్రత్యేక స్విచ్

కాటాలకు ప్రత్యేకంగా స్విచ్ ఏర్పాటు చేస్తున్నారు. నీరు ఎక్కువగా వేయడం ద్వారా 100 గ్రాముల వరకు తగ్గిస్తారు. వినియోగదారుడి కళ్లుగప్పి స్విచ్ నొక్కితే చాలు బరువు 250 గ్రాములు పెరిగిపోతుంది. క్షణాల్లో దాన్ని తీసేసి రేటు వసూలు చేస్తారు. ఇదంతా చేతి వాటంతో జరిగిపోతుంది.



గోపాలపట్నం బజారు

నిఘా ఏదీ?

ఇక్కడి బజారులో మోసాలపై ఫిర్యాదు అందుతున్న సమయంలో హడావుడి చేస్తున్న అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బందితో వ్యాపారస్తులు లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని లంచాలు తీసుకోవడం వల్ల వీరిలో విచ్చల విడితనం పెరిగిందని ఆరోపిస్తున్నారు. కాటాల్లో మోసాలు ఎలా చేయవచ్చో టెక్నికల్‌గా ఏర్పాట్లు ఎలా చేయాలో నేర్పించేది కూడా దిగువ స్థాయి సిబ్బందేనని కొందరు ఆరోపిస్తున్నారు. అధికారులు ఎవరు వస్తున్నారు... ఎపుడు వస్తారన్న విషయాలను కూడా వీరే ముందస్తుగా వ్యాపారులకు సమాచారమందిస్తున్నారు.



కాటాలను సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

ధర్మ కాటా ఏర్పాటు చేయాలి

ఇక్కడి చేపల బజారులో ప్రధానంగా ఆదివారం, మంగళ బుధవారాల్లో ఎక్కువగా కొనుగోలుదారులు వస్తుంటారు. ఆ సమయంలో ధర్మ కాటాతో పరిశీలిస్తే మోసం వెలుగులోకి వస్తుందని వినియోగదారులు అంటున్నారు. తూనికలపై అవగాహన కలుగుతుందని మోసాలను నిలదీసే అవకాశముంటుందని వినియోగదారులు కోరుతున్నారు.

కాటాల్లో మోసం



చేపల బజారులో కాటాల్లో మోసాలు జరుగుతున్నాయి. కిలోకి 250 గ్రాముల వరకూ తక్కువ వస్తోంది. దీనిపై నేను పలు మార్లు నిలదీశాను. నాపై వ్యాపారులు గొడవకు దిగిన రోజులు ఉన్నాయి. వీరిపై తగిన చర్యలు తీసుకోవాలి. కొనుగోలుదారులకు న్యాయం చేయాలి.

– పాలమరెడ్డి కోటేశ్వరరావు

ప్రత్యేక డ్రైవ్ పెడతాం

చేపల బజారులో ప్రత్యేక డ్రైవ్ పెడతాం. గతంలో కూడా ఇక్కడ తనిఖీలు చేపట్టాం. ఒకే రేటు పెట్టాలని.. తూనికల్లో వ్యత్యాసాలు లేకుండా వ్యాపారాలు చేయాలని సూచించాం. కొన్ని కాటాలు కూడా సీజ్ చేశాం. డ్రైవ్ పెట్టి కఠినంగా వ్యవహరిస్తాం.

– రవి కుమార్, డీసీ, లీగల్ మెట్రాలజీ

బడి బస్సు భద్రమేనా..!

ఫిట్‌నెస్ లేకుండానే రోడ్లపైకి బస్సులు



బస్సులు తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు(ఫైల్)

విశాఖ విద్య: ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులను తరలించే బస్సులు, ఇతర వాహనాల ఫిట్‌నెస్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో హడావుడి చేసిన రవాణాశాఖ అధికారులు, ప్రస్తుతం తనిఖీల ఊసెత్తకపోవడం అనుమానాలకు తావిస్తోందని తల్లిదండ్రులు అంటున్నారు. గోపాలపట్నం మండలంలో ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 103 స్కూళ్లు ఉండగా, వీటి పరిధిలో 33 వేలకు పైగా విద్యనభ్యసిస్తున్నారు. జూనియర్, డిగ్రీ కాలేజీలు సైతం ఎన్ఏడీ చుట్టుపక్కలు ఎక్కువగానే ఉన్నాయి. విద్యార్థులను ఇళ్ల నుంచే బస్సులపెట్టి సదరు యాజమాన్యాల వారు తరలిస్తున్నారు. కానీ, బడి బస్సులపై తనిఖీలు లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా బడి బస్సులను తిప్పుతున్నారని గుర్తించారు. వాటిపై చర్యలు సైతం చేపట్టారు. అయితే, ఈ ఏడాది బస్సులపై తనిఖీలు ఎందుకు చేయడం లేదని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. బస్సులు, ఇతర వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులు తీసుకెళ్తున్నారు. చాలావాహనాలు ఫిట్‌నెస్ లేకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి. ఇలాంటి వాటిపై దృష్టి పెట్టేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

60 మందికి నేత్ర వైద్య పరీక్షలు



ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని సీఐ ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. స్టేషన్‌సిబ్బందితో పాటు కక్షిదారులకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. సుమారు 60 మందికి మ్యాక్సి విజన్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సేవలందించారు. వైద్యులు అయ్యప్ప, వేదవతి, వెంకట్, ఎస్ఐలు రామకృష్ణ, సీహెచ్ ప్రసాద్, ఏఎస్ఐలు రవిచంద్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంతలో బోరుబావి ఏర్పాటు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బాజీజంక్షన్‌లోని సంత సముదాయంలో తాగునీటి వసతి కోసం నూతన బోరు నిర్మాణానికి కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం శంకుస్థాపన చేశారు. సంతలో దుకాణాలు నిర్వహణకు అనువైన సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా వ్యాపారులు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ వాటర్ విభాగం డీఈ వీరయ్య, గోవింద్, శరగడం అరుణ్,వర్తక సంఘం అధ్యక్షులు రమణ, బొమ్మిడి రాజు, శ్రీను పట్నాయక్, నమ్మి రవి పాల్గొన్నారు.

పాడి పశువులకు వసతుల కల్పన

సింధియా: జీవీఎంసీ జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని క్రాంతినగర్, చింతల్లోవ గ్రామాల్లోని సుమారు 70 మంది పాడి రైతులతో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా సోమవారం సమావేశమయ్యారు. పాడి రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. పశువుల మనుగడకు షెడ్లు, పోషక విలువలతో కూడిన దాణా, వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఎం నాయకుడు వెంకటరమణకు నివాళి



వెంకటరమణ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌కు చెందిన సీపీఎం మాజీ కార్యదర్శి ఎస్.వెంకటరమణ ఆకస్మిక మరణం సీపీఎం పార్టీకి, క్రాంతినగర్ ప్రజలకు తీరని లోటని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ఎస్.వెంకటరమణ మృతదేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ క్రాంతినగర్ గ్రామ సమస్యలను పరిష్కరించడంలో వెంకటరమణ ముందుండేవాడన్నారు. సీఐటీయూ, డీవైఎఫ్ఐ సంఘాల అభివృద్ధి కృషి చేశారని కొనియాడారు. సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడి రాజు, డీవైఎఫ్ఐ నాయకులు, ఐద్వా నాయకులు, క్రాంతినగర్ ప్రజలు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎస్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

సింహగిరిపై ఏకాదశి తిరువీధి



తిరువీధిలో ఉత్సవమూర్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం సాయంత్రం మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులకు విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. ఆలయ బేడామండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హారతులు అందించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

హెచ్‌పీసీఎల్ అధికారులకు ఐఐఎంవీలో శిక్షణ



ఐఐఎంవీలో శిక్షణకు హాజరైన హెచ్‌పీసీఎల్ అధికారులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన 580 మంది అధికారులకు 18 బ్యాచ్‌లుగా ఎలివేట్ శిక్షణ ఇవ్వనుంది. మూడు రోజుల వ్యవధి గల మొదటి బ్యాచ్‌కు సోమవారం శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ అనురాధ మాట్లాడుతూ స్వీయ అవగాహన, కమ్యూనికేషన్, నాయకత్వం, నైతికతపై అధికారుల వ్యక్తిగత, వృత్తిపరమైన సామర్థ్యాలను పెంచడమే లక్ష్యంగా శిక్షణ ఉంటుందన్నారు. కోర్సు వివరాలను తెలియచేశారు. విశాఖ రిఫైనరీ మోడరనైజేషన్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్ త్రివేది మాట్లాడుతూ సాంకేతిక సామర్థ్యం, నిర్వాహక బాధ్యతల మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ జి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నెట్‌వర్కింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత గురించి వివరించారు. ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ సాధించిన అద్భుతమైన విజయాలు, కీలక కోణాల్లో స్థిరమైన వృద్ధిని అభినందించారు.

క్షణికావేశంలో వివాహిత బలవన్మరణం

- బంగారం తాకట్టు పెట్టే విషయంలో గొడవ
- భర్త ఇంట్లో ఉండగానే ఉరి వేసుకున్న భార్య



నూకరత్నం(ఫైల్)

గోపాలపట్నం: భర్తపై కోపంతో క్షణికావేశంలో ఉరి వేసుకుని మహిళ మృతి చెందిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి కొత్త కరాసాలో చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. వేముల వలస నూకరత్నం (37) భర్త రాజుతో కలసి కొత్త కరాసా గోకులం రెసిడెన్సీలో నివాసముంటోంది. రాజు ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారానికి కొంత నగదు అవసరం వచ్చింది. దీంతో నగలు తాకట్టు పెడదామని భార్య నూకరత్నాన్ని అడిగాడు. ఈ విషయమై వీరి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరిగింది. దీంతో మనస్తాపానికి గురైన నూకరత్నం బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకునే ప్రయత్నం చేయగా మూడు మార్లు ఆపాడు. అవసరాన్ని వివరించి బంగారం తాకట్టు పెట్టించేందుంకు ఒప్పించే ప్రయత్నం చేశాడు. ఇంతలో రాజుకు ఫోన్ రావడంతో మాట్లాడుతుండగా బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుంది. బెడ్‌రూమ్‌లో శబ్దం రావడంతో తలుపు తెరిచేందుకు యత్నించినా రాలేదు. స్థానికుల సహకారంతో తలుపు విరిచారు.ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. వేలాడుతున్న నూకరత్నాన్ని కిందకు దించి 108కి ఫోన్ చేశారు.108 సిబ్బంది వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి ఎస్ఐ రామకృష్ణ చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కాగా రాజు మొదటి భార్యను విడిచిపెట్టి నూకరత్నాన్ని పెళ్లి చేసుకున్నాడు. వీరు సుమారు నాలుగైదేళ్లుగా సంతోషంగా జీవిస్తున్నారు. ఇటీవలే ఇక్కడ అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసుకుని ఉంటున్నారు. వీరికి పిల్లలు లేరు. భర్త రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

అట్రాసిటీ చట్టం అమలులో యంత్రాంగం విఫలం



ఆడిట్ రిపోర్ట్ ఆవిష్కరిస్తున్న ఆచార్య చలం తదితరులు

సీతంపేట: దళితులు చైతన్యవంతులై నిలదీస్తే చట్టాలు పక్కాగా అమలవుతాయని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ ఛైర్మన్ ఆచార్య కె.ఎస్. చలం అన్నారు. సిటిజన్స్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ 1989, రూల్స్ 1995' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. దళిత ఆదివాసీలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయని, దేశవ్యాప్తంగా దళితులపై అంతులేని వివక్ష కొనసాగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు తీరు దారుణంగా ఉందని ఎన్‌సీడీహెచ్‌ఆర్ చాప్టర్ రాష్ట్ర కన్వీనర్ చిట్టిబాబు రూపొందించిన నివేదిక ద్వారా తేటతెల్లమైందన్నారు. ఇప్పటికీ వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటే ఈ చట్టం అమలు తీరు అర్థమవుతోందన్నారు. చట్టం అమలు తీరుపై రూపొందించిన ఆడిట్ రిపోర్ట్‌ను ఆవిష్కరించారు. కన్వీనర్ చిట్టిబాబు మాట్లాడుతూ రోజుకు ఆరు అత్యాచారాలు, నెలకు ఐదు హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నియంత్రించడంలో, అట్రాసిటీ చట్టం అమలులో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. సుప్రీం కోర్టు సైతం చట్టం అమలుపై ఆడిట్ చేయాలని తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. చట్టం పటిష్టంగా అమలయ్యేలా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ రిటైర్డ్ జేడీ టి.విజయ్‌కుమార్, పారా డైరెక్టర్ థామస్, డీబీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు దేవకుమార్, మంజు, ఉదయ్‌కుమార్, మాల్యాద్రి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ పరిసరాల పరిశుభ్రతకు చర్యలు



రైల్వేస్టేషన్ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

తాటిచెట్లపాలెం: రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రైల్వే, ప్రజారోగ్య అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం జోన్–5 పరిధి రైల్వే స్టేషన్ నుంచి తాటిచెట్లపాలెంలో ఆయన పర్యటించారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎదురుగా పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులను రోజూ ఎన్ని గంటలకు విధులకు వస్తున్నారని, వ్యర్థాలను క్లాప్ వాహనం ద్వారా ఎన్నిసార్లు తరలిస్తారని అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్ జనరల్ బుకింగ్ కౌంటర్ పరిసర ప్రాంతాలైన కార్ పార్కింగ్, వీఐపీ కార్ పార్కింగ్, ఆటో స్టాండ్ పార్కింగ్ వద్ద ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, రైల్వే స్టేషన్ పర్యవేక్షకుడు జి.సి.నాయక్‌లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని దుకాణాల వద్ద, పరిసర ప్రాంతాల్లో అధికంగా వ్యర్థాలు ఉండటం గమనించి రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని, రైల్వే యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని జోనల్ కమిషనర్ రాముకు ఆదేశించారు. రైల్వే స్టేషన్ మార్గంలో, అక్కడి దుకాణాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా నిత్యం పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా ప్రకటన చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. రైల్వే స్టేషన్ బయట లోటస్ ఇంటర్నేషనల్ నిర్వహిస్తున్న ప్రజా మరుగుదొడ్లను పరిశీలించారు. పర్యటనలో జెడ్సీ రాము, ఈఈ దిలీప్, ఏఈ పళనికుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ అర్చన పాల్గొన్నారు.

ఇవేం పనులు!

- ఇళ్లల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు
- అధికారుల తీరుపై ప్రజానీకం అసహనం



ఎస్ఎస్‌టీఎల్ రోడ్‌లోని దుకాణం వద్ద తవ్వేసిన దృశ్యం

విశాఖ విద్య: నగర పాలక సంస్థ అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా చేస్తున్న పనులతో ప్రజానీకం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింహాచలం గిరిప్రదక్షిణ సమయంలో భక్తుల సౌకర్యం పేరిట చేసిన పనులు అన్నీ అసంపూర్తిగానే మిగిలాయి. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఎస్ఎస్‌టీఎల్ నుంచి సింహాచలం వెళ్లే రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆధునీకీకరించేలా గిరిప్రదక్షిణకు ముందు పనులు చేపట్టారు. ఇందు కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను తవ్వేశారు. కానీ ఆ పనులు పూర్తి చేయలేదు. తవ్విన చోట కొత్తగా టైల్స్ వేస్తామని అధికారులు చెప్పారు. ఆ పనులను మధ్యలోనే వదిలేశారు. గుంతలు పెట్టి వదిలేయడంతో వాటి మీద నుంచి ఇళ్లల్లోకి వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. కొత్త టైల్స్ వేయడం మాటేమో కానీ అధికారులు చేసిన పనితో మాకు ఇబ్బందులు వచ్చాయని ఏపీఎస్ఈబీ కాలనీకి చెందిన నాగరాజు అనే చిరు వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశాడు. గిరిప్రదక్షిణ సమయంలో ఇలాంటి పనులు చేసేందుకు చేసినకార్యాచరణ ఏంటి..? వాటికి ఏ మేర నిధులు వెచ్చించారు..? ఇలా అసంపూర్తిగా పనులు చేపట్టి, కూటమి నాయకులేమైనా నిధులు కాజేశారా? అనే అనుమానాలను ఇక్కడి ప్రజానీకం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు దృష్టి సారించి అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేసి అసౌకర్యం లేకుండా చూడాలని ప్రజానీకం కోరుతున్నారు.



ఇంటి ముందు తవ్వి వదిలేశారిలా..

రోడ్డు అభివృద్ధి చేయాలని వినతి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో శిథిలమైన ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ కార్పొరేటర్ గులిగిందల లావణ్య సోమవారం పోర్టు అధికారులకు వినతిపత్రం అందజేశారు.రోడ్డుగా పూర్తిగా శిథిలం కావడంతో పారిశ్రామిక ప్రాంత వాసులతో పాటు, గాజువాక ప్రాంత వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. శిథిలావస్థ లో ఉన్న రోడ్డు పోర్టు ఆధీనంలో ఉందని.. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేయా లని కోరారు. డాక్‌యార్డ్ సమీపంలోని సర్దార్ వల్లబాయ్ పటేల్ వంతెన మూసి వేయడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ప్రజలు ములగాడ సేవా మార్గం ద్వారా నగరానికి చేరుకుంటున్నారని, ఆ మార్గం గుంతల మయంగా ఉండడంతో అసౌకర్యానికి గురికావడంతో పాటు ప్రమాదా ల సంభవిస్తున్నాయని వివరించారు. త్వరలో మరమ్మతులు నిర్వహించి వాహనదారులకు ఇబ్బంది లు లేకుండా చర్యలు తీసుకుంటామని పోర్టు అధికారులు హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ లావణ్య తెలిపారు.

25 నుంచి శ్రీచక్ర సహిత రాజేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీచక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి చతుర్థ వార్షికోత్సవాన్ని ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న ఉదయం ఆలయ ప్రదక్షిణ, గోపూజ, భూతబలి, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రుత్విక్‌వరణ, దీక్షధారణ, అస్త్రరాజార్చన, ప్రధాన కుంభవాహన, మధ్యాహ్నం ధ్వజారోహణ, నీరాజన మంత్రపుష్పములు, చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 26, 27 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం



జోన్-5 కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి నాలుగు వినతులను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01, వాటర్ సప్లై విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, వాటర్ ఏఈ సుమన్, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, జనార్దనరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 24 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో మూడు వేర్వేరు కేసుల్లో నిందితులను అదుపులోకి తీసుకుని, 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణలు తమ సిబ్బందితో కలిసి స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. ఒడిశా గంజాం జిల్లాకు చెందిన రాహుల్ కుమార్ విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా ఢిల్లీకి గంజాయిని అక్రమంగా తీసుకురావడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడి వద్ద నుంచి రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

- జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు తమ సిబ్బందితో కలిసి వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ ఆలీగఢ్ జిల్లాకు చెందిన మోహన్ చౌదరి, కిషన్ కుమార్‌లు అరకు బొర్రాగుహల నుంచి విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు గంజాయిని అక్రమంగా తీసుకెళ్లడాన్ని గుర్తించి వీరిని అదుపులోకి తీసుకున్నారు. రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని సీజ్ చేశారు.
- జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు తమ సిబ్బందితో కలిసి వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. ఒడిశా కోరాపుట్ జిల్లాకు చెందిన దశరథ్ మాతం విశాఖ రైల్వే మీదుగా గంజాయిని అక్రమంగా తీసుకురావడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడి వద్ద నుంచి రూ.20 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

కల్తీ మద్యం ముఠాపై చర్యలకు డిమాండ్

పరవాడ: కల్తీ మద్యంతో సంబంధంఉన్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు డిమాండ్ చేశారు. స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేసి, బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్న ముఠా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. పరవాడలో కల్తీ మద్యం తయారు చేసిన వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మద్యాన్ని నియంత్రిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం.. గుడి, బడి అనే తేడా లేకుండా వద్ద మద్యం అమ్మకాలు జరుపుతోందని ఆక్షేపించారు.

పీజీఆర్ఎస్‌కు 5 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంటలోని జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.